# వింత ప్రహసనం

శారద కాశీవఝ్ఝల

మా అత్తగారికీ మధ్య ఒక కొత్త కోరిక పుట్టింది. విదేశీయులలో కలిసి ఫోటో తీయించుకోవాలనే ఆ కోరిక వెనకాల కథ చిన్నదేం కాదు.

ఒకరోజు ఎప్పటిలానే మావారిని ఆఫీసుకీ, పిల్లల్ని స్కూలుకీ తోలేశాక వంటిల్లు సర్దుకుంటూ కూర్చున్నాను. మా అత్తగారు పక్కింటి మీనాక్షమ్మతో దొడ్లో కూర్చుని కబుర్లు చెపుతోంది. ఇక్కడ మీనాక్షమ్మ గారి గురించి కొంత చెప్పుకోవాలి.


ఆవిడకు ఇద్దరు కొడుకులు. ఒకరు సివిల్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. ఇంకొకరు జర్మనీలో ఏదో వ్యాపారం చేస్తున్నారు. అన్నయ్య పెళ్ళి కుదిరినప్పుడు రెండోవాడు వస్తూ, వస్తూ తనవెంట నలుగురు జర్మన్ ఫ్రెండ్స్‌ని కూడా పెళ్ళికి తీసుకొచ్చాడు. సరదాకి వాళ్ళ నలుగురితో కలిపి తల్లికి కూడా ఓ ఫోటో తీశాడు.

పెళ్ళి సందడి తగ్గిన నెల రోజులకి ఆ ఫోటో పట్టుకుని ఆవిడ మా అత్తగారి`దగ్గరికి వచ్చింది. మా అత్తగారు నిజానికి చాలా అమాయకురాలు. కానీ ప్రతీ మనిషిలో ఉన్నట్లే ఆవిడకు కూడా అసూయ ఉంటుంది కద్రా! ఆవిడ ఫోటో చూస్కుని మురిసిపోతూ గొప్పలు పోవడం మా అత్త గారికి నచ్చలేదు. తన అసహనాన్ని కప్పిపుచ్చుకోడానికి ఫెళ్ళున పెద్దగా నవ్వేసింది, అదేదో జోకలాగా. ఆవిడ్ని చిన్నబుచ్చి ఎద్దేవా చేద్దామనుకున్న మీనాక్షమ్మ గారికి ఎందుకు నవ్వుతుందో తెలీక తెల్లబోయింది.

"ఓస్! ఈ మాత్రం దానికి అలా ప్రపంచాన్ని జయించినట్లు గెంతులు వేస్తావేం? అదేవన్నా పే...ద్ద గొప్పటమ్మా? మా శైలజ పెళ్ళిలో పెళ్ళి కొడుకు తరపున బోల్డుమంది విదేశీయులు వచ్చారు. పందిరి మొత్తం సగం వాళ్ళే. మా ఇంట్లో ఒక్కొక్కళ్ళూ వాళ్ళతో కలిసి ఎన్నెన్ని ఫోటోలు తీయించుకున్నామో లెక్ఖే లేదు. నీకు చూపిద్దును కానీ ఆ ఆల్బం శైలజ దగ్గిరే ఉండిపోయింది. ఐనా అదంత వింత విషయమా, మెళ్ళో కట్టుకుని ఊరంతా చూపించటానికి? నేనే అది తీస్కెళ్ళమంటున్నా అక్కడే వదిలేసి వచ్చాను. హు.. నీకిది మొదటిసారేమోలే. అందుకే అంత వింతగా మురిసిపోతున్నావు" సాగదీస్తూ అంటున్న మా అత్తగారి ఆశు కల్పనకి నాకు నోట మాట రాలేదు. మ్లానమైన మీనాక్షమ్మ గారి మొహాన్ని ఊహించగలిగాను. శైలజ మా ఆడబడుచు.

"అహ... అంటే, నేనూ ఇదివరకు తీయించుకున్నాననుకో. నువ్వెప్పుడైనా చూశావో లేదో, చూపిద్దామని అంతే" చురక అంటించింది ఆవిడ. "ఐతే ఎప్పుడు చూపిస్తావు నాకా ఫోటో? వచ్చే నెల్లో పండక్కి వెళ్తానన్నావుగా మీ అమ్మాయి వాళ్ళింటికి. అప్పుడు తప్పకుండా తీసుకురా. ఆఁ... ఐనా నా పిచ్చిగానీ, ఇన్నిసార్లు చెప్పాక నువ్వు మర్చిపోయి ఎలా వస్తావులే. ఇంక నేవెళ్తానమ్మా మా అబ్బాయి రావటానికి ఒక టైమంటూ లేదుగా" అంటూ లేచి వెళ్ళిపోయిందావిడ.

మా అత్తగారు కూడా లోపలికొచ్చేశారు. తిన్నగా గదిలోకెళ్ళిపోయి, కుర్చీలో కూర్చుని ఏదో దీర్ఘ ఆలోచనలో మునిగిపోయారు.




బహుశా కొనితెచ్చుకున్న కొత్త సమస్యకు పరిష్కారం ఎల్లా అనేమో! నోరు జారిన తర్వాత పరువు కాపాడుకోవద్దూ! ఐనా ఈవిడ మాత్రం, ఫోటో చూసి బావుందంటే ఏంపోయె? ఆవిడ కూడా సంతోషించేది కదా! ఆలోచిస్తూ పని పూర్తి చేశాను.

•••

మా పిల్లలు రాధ, రవి, సాయంత్రం స్కూలు నుంచి వచ్చి దీర్ఘాలోచన్లో మునిగున్న బామ్మని చూసి ఏదో జరిగుంటుందని గ్రహించారు. మొహాలు కడిగి, హెూంవర్కు పూర్తి చేస్కుని నాదగ్గిరికి జేరి "ఏంటమ్మా! బామ్మ అలా ఉంది" అంటూ కూపీలాగే ప్రయత్నం చేశారు. ఏం చెప్తే ఏం తంటా వస్తుందోనని, నేను వాళ్ళని ఆవిడ్నే అడగమని చెప్పాను. పిల్లలిద్దరూ పిల్లుల్లా బామ్మ గదిలో ప్రవేశించారు. రవి చాలా అల్లరి వెధవ. బామ్మని ప్రతి పనిలోనూ విసిగించడం, ఏడిపించడం మహా ఇష్టం. "ఏంటి బామ్మా! ఆలోచిస్తున్నావూ? నాకు చెప్పవూ?" రవి మాటలకి బామ్మగారు ఉలిక్కిపడి ఈ లోకంలోకొచ్చారు. "ఎప్పుడొచ్చార్రా మీరు? నే చూడనే లేదు. పాలు తాగారా" అంటూ ప్రశ్నలు మొదలెట్టారు.

"అవన్నీ అయ్యాయి గానీ, నీ విషయం చెప్పు బామ్మా" రాధ తొందరపెట్టింది.

"ఆఁ... ఏం లేదురా" పిల్లకాయలు ఏం చేయగలరులే అనే నిరశతో విచారంగా అందావిడ.

కానీ మా రాక్షసులు విడిచిపెడితేనా, అర గంటసేపు లాగి, పీకి చివరికి విషయం రాబట్టారు.

•••

మర్నాడు భోజనాల దగ్గర టైమైపోతోందని పిల్లలు గొడవపెడ్తూంటే హడావుడిగా వంట చేస్తున్నాను. ఒకపక్క వంట. మరోపక్క వడ్డనతో సతమతమౌతున్న నా చేతిలోంచి కూరగిన్నె తీసుకుని "నువ్వు వంట పూర్తిచెయ్యి, నేను వడ్డిస్తాలే వాళ్ళకి" అంటూ మా అత్తగారు టేబుల్ దగ్గరికి వెళ్ళారు.

నిశ్శబ్ద రాజ్యాన్ని కొంచెంసేపు పిల్లల హడావుడీ, గరిటల చప్పుళ్ళూ ఏలిన తర్వాత "ఒరేయ్ శశి" మెల్లిగా మా అత్తగారి గొంతు వినిపించింది.

"ఏంటమ్మా"

"నీకు ఎవరన్నా ఫ్రెండ్స్ ఉన్నారా?"

"అదేంటమ్మా! ఫ్రెండ్స్ ఉండకుండా ఎవరుంటారూ?" మావారి ఆశ్చర్యం.

"అది కాదురా! ఫ్రెండ్స్ అంటే విదేశీ ఫ్రెండ్స్ అని" మావారిని అజ్ఞానిని చూసినట్లు చూసి చెప్పిందావిడ.

"విదేశీ ఫ్రెండ్సా!" మరింత ఆశ్చర్యపడ్డారు. మా ఆయన.

ఇంక తాము రంగంలోకి దిగాల్సిందే అనుకున్నారేమో పిల్లలిద్దరూ, "అది కాదు నాన్నా! మరేమో పక్కింటి ఆంటీ, వాళ్ళబ్బాయి పెళ్ళిలో విదేశీయులు కూడా వస్తే, వాళ్ళతో కలసి ఫోటో తీయించుకున్నారు. మరావిడ బామ్మ బెస్టు ఫ్రెండ్ కదా! అందుకని అది తీస్కొచ్చి చూపించింది."

"ఛట్! ఆవిడ దగ్గరున్నప్పుడు నాకు మాత్రం ఎందుకు కుదరదు, నేను కూడా విదేశీయులతో కలిసి ఫోటో తీయించుకోవలసిందే అని బామ్మ అప్పటికప్పుడే భీషణ ప్రతిజ్ఞ చేసేసుకుంది" రాధ వాక్యాన్ని రవి పూర్తిచేశాడు; బామ్మ వైపు కొంటెగా చూస్తూ.

పిల్లలిద్దరూ తమ స్కూలు సంగతి మర్చిపోయి అలా తండ్రికి విపులీకరిస్తుంటే నాకు నవ్వొచ్చింది.

"నువ్వెందుకు ఇకిలిస్తావు! వెళ్ళి పన్చూసుకో" ఉడుక్కున్నారావిడ. ఆవిడను చూసి మావారు నచ్చచెప్పే ధోరణిలో అన్నారు. "అది కాదమ్మా ఆవిడెవరో ఏదో చేసిందని నువ్వు పంతం పట్టడం ఏమిటి చెప్పు? ఆవిడకు అవకాశం వచ్చింది. దానివల్ల ఒరిగిందేమీ లేదు, మనం నష్టపోయిందేమీ లేదు. నువ్వు కోరింది తప్పని నేను అనట్లేదు. కానీ సమంజసమైనదేనా? నువ్వు ఆలోచించు" తన ప్రెస్టీజికి సంబంధించిన విషయాన్ని కొడుకంత తేలిగ్గా తీసిపారేయటం మా అత్తగారికి నచ్చలేదు. అది గమనించి మావారు "ఇందులో అంత బాధపడాల్సిందేముందమ్మా? ఐనా నాకు తెలిసిన ఫారెన్ ఫ్రెండ్స్ ఎవరూ లేరు. పైగా నెల రోజుల్లో అంటున్నావు, చూద్దాం" అంటూ వెళ్ళిపోయారు.

"చూద్దాం" అని మావారు అన్నారంటే ఇంక ఆ విషయం అడిగినవాళ్ళు మర్చిపోవచ్చు అని అర్థం. అది నా అనుభవం మీద తెలుసుకొన్నాను. కానీ మా అత్తగారికి చెప్పడానికి భయమేసి ఊర్కున్నాను.

హఠాత్తుగా నాకు అ ఊర్లోనే ఉంటున్న మా ఫ్రెండ్ రోజా గుర్తొచ్చింది, దాని భర్త అమెరికా అతనే. కానీ అతను అమెరికన్ అంటే ఎవరూ నమ్మరు. వెస్ట్ ఇండీస్ వారి రంగులో ఉంటాడు.

మెల్లగా మా అత్తగారిని సమీపించాను. "నాకు తెలిసిన ఫ్రెండ్ ఒకమ్మాయి అమెరికన్‌ని పెళ్ళి చేస్కుంది. ప్రస్తుతం వాళ్ళు ఈ ఊర్లోనే ఉంటున్నారత్తయ్యా!"

నామాట పూర్తవకముందే ఆవిడ నావైపు సంతోషంగా చూస్తూ, "మరా విషయం ఇన్ని రోజులూ చెప్పలేదే? వాళ్ళ బంధువులు కూడా ఇక్కడే ఉంటున్నారా? అలా ఐతే ఎక్కువ మందితో కలిసి తీయించుకోవచ్చు. ఇంతకీ మనం వాళ్ళింటికి ఎప్పుడు వెళ్దాం? మనింట్లో కెమెరా ఉందిగా! రెండు, మూడు తీస్కుందాం. మాట్లాడవేమే" అంది.

చిన్నపిల్లలా సంతోషపడిపోతున్న ఆవిడ్ని ఉండమని, లోపలికి వెళ్లి రోజా పెళ్ళి ఫోటో తెచ్చి ఆవిడ చేతిలో పెట్టాను, ఫోటోలో రోజా పక్కన నుంచున్నతన్ని చూసిన మా అత్తగారి మొహంలో క్షణంలో రంగులు మారిపోయాయి.

రెండు క్షణాల తర్వాత ఫోటో నాకేసి విసిరి కొట్టి, తీక్షణంగా చూస్తూ, "ఏమే! నీకేం నవ్వులాటగా ఉందా? అసలు నిన్నెవడడిగాడని బోడి సలహాలు! ఈ నల్ల తుమ్మమొద్దు, అమెరికనా? నేనంత పిచ్చిదాన్లా కన్పడుతున్నానా నీ కళ్ళకు?"

"అది కాదత్తయ్యా! తెల్లగా ఉంటేనే విదేశీయులని కాదు కదా! ఇతను....."

"నోర్మూసుకో! నువ్వేం నాకు చెప్పఖ్ఖర్లేదు. నా ఏడుపేదో నేనేడుస్తాను" విసురుగా గదిలోకి వెళ్ళి తలుపేస్కున్నారు. మంచికి పోతే చెడు ఎదురైందని తిట్టుకుంటూ, నేను మళ్ళీ పనిలో పడ్డాను.

***

**చూ**డ్డానికి అంత చిన్నదిగా కనపడ్డ ఆ సమస్య రోజులు గడుస్తున్న కొద్దీ ఎంతో కొంత ఇంట్లో వాళ్ళందరికీ అసహనాన్ని కలిగిస్తోంది. నిద్రాహారాలు మాని పగలూ, రాత్రీ మా అత్తగారు దీర్ఘాలోచనలో మునిగిపోవడం, పిల్లల్ని మునుపటిలా హుషారుగా దగ్గరికి తీయకపోవటం, సర్వస్వం కోల్పోయినట్లు బాధపడ్డం మావారికి కూడా ఒక రకంగా అసంతృప్తినీ, విసుగునీ కలిగించాయి. మొదట్లో ఆటలాడుతూ బామ్మని వెక్కిరించడానికి ఉపయోగపడిన విషయం ఎంతకీ పరిష్కారం కాకపోవడం పిల్లలకి కూడా చిరాగ్గా ఉంది. ఎప్పుడూ గోలగోలగా ఉండే ఇల్లు, ఎవరి పన్లు వాళ్లు చేస్కుంటూ ఇంకో మనిషి కనబడితే మొహాలు చిట్లించుకోవడం దాకా వచ్చింది. మా అత్తగారు బయటికి వెళ్ళడం పూర్తిగా మానేసింది, పక్కింటావిడ భయంతో. కానీ ఆవిడ ఎంత తప్పించుకున్నా మీనాక్షమ్మగారొచ్చి రెండు మూడు రోజులకు ఒకసారి ఫోటో సంగతి గుర్తుచేసిపోవడం పుండు మీద కారం జల్లినట్లు ఉంది. అంత వయసొచ్చి చిన్నపిల్లలా మా అత్తగారు ప్రవర్తించడం నాకు కోపాన్ని తెప్పించింది.

***

"**అ**మ్మా! అమ్మా!" గట్టిగా అరుస్తూ మా అత్తగారి గదిలోకి పరిగెత్తారు మావారు, ఆ సాయంత్రం ఆఫీసు నుంచి వస్తూనే.

విషయం ఏమిటో అని నేను కూడా వెళ్ళాను.

"అమ్మా! నీకో గుడ్‌న్యూస్! మా బాస్ వాళ్ళ బంధువులు ఎవరో ఎల్లుండి వస్తున్నారట అమెరికా నుంచి. వాళ్ళ స్నేహితులు ఇండియా చూడ్డానికి తెగ ఉత్సాహపడిపోతుంటే వాళ్ళని కూడా తీసుకువస్తున్నారు. నేను మా బాస్‌తో మాట్లాడాను. వాళ్ళు వెళ్ళేముందు మనింటికి తీసుకొస్తానన్నారు. నువ్వు ఫోటో తీస్కుందువుగాని సరేనా" ఆయాసంతో చెప్తున్నారు.

మా అత్తగారి మొహం వెలిగిపోయింది. నోట మాట రానిదానిలా అలా చూస్తూండిపోయారు.

ఇంతలో మా పిల్లలు వచ్చారు "నాన్నా! మేము కూడా తీస్కుంటా"మంటూ. "అలాగలాగే" అంటూ భరోసా ఇచ్చేశారు.

మా అత్తగారి ఆనందానికి పగ్గాలు లేవు. వెంటనే ఆ విషయాన్ని మీనాక్షమ్మ గారికి చెప్పేయాలనే ఆరాటం ఆవిడ్ని నిలవనివ్వటం లేదు.

గబగబా దొడ్లోకి వచ్చి పిలిచింది. సమాధానం లేదు. రెండు మూడు నిమిషాల తర్వాత బయటకు వచ్చింది పక్కింటావిడ. ఆవిడ మొహంలో అస్సలు ఉత్సాహం లేదు. మా అత్తగారేదో అనేలోగానే ఇంట్లోకి వెళ్ళిపోయింది. నేను ఆశ్చర్యపోయాను.

మర్నాడు మా రవిగాడు హడావుడిగా లోపలికొచ్చాడు.

"బామ్మా బామ్మా" అని అరుస్తూ.

ఆవిడ పూజ పూర్తిచేసుకుని, "ఏవిట్రా" అంటూ వచ్చారు.

"మరేమో, పక్కింటి ఆంటీ విదేశీయులతో కలసి తీయించుకున్న ఫోటో" ఆగాడు బామ్మ ఆత్రం చూసి నవ్వుకుంటూ, "ఏవిట్రా తొరగా చెప్పేడు". "ఎదురింటి ఆంటీ వాళ్ళ బాబిగాడితో వీళ్ళింటికి వస్తే, ఈవిడ ఫోటో చూపించింది. వాళ్ళిద్దరూ కబుర్లలో ఉండగా, వాడు దాన్ని ముక్కలు ముక్కలు చేసేశాడు" ఉత్సాహంగా చెప్పుకొచ్చాడు.

నేను మా అత్తగారి మొహంలోకి చూశాను.

***

**అ**నుకున్న రోజు రానే వచ్చింది, ఇద్దరు మగవాళ్ళు, ముగ్గురు ఆడవాళ్ళు విదేశీయులు కాగా, మావారి ఆఫీసరు. వాళ్ళ బంధువులు ఇద్దరు. టీ తాగిన తర్వాత ఫోటోలకి అందరం సిద్ధమయ్యాం. మా అత్తగారు చీర సర్దుకుని, అంతలోనే ఏదో గుర్తుచ్చినట్లు ఫారెనర్స్ వంక చూశారు. అందరూ జుట్టుతో సహా తెల్లగా మెరిసిపోతున్నారు. తృప్తిగా నిట్టూర్చారు, ఆవిడ. విదేశీ మగవాళ్ళు వెనకాల చెరోవైపు, మధ్య మా ఆయనా, ఆఫీసరూ, ముందు వరస. ఆడాళ్ళు ముగ్గురూ, పిల్లలూ, నేనూ, మా అత్తగారూ. సరీగ్గా క్లిక్‌మనిపించే సమయానికి, అరికాలి మీద చీమ కుట్టింది. దాన్ని దులిపేలోగా ఫోటో తీసేస్తాడనే భయంతో మొహాన నవ్వు పులుముకున్నా.

మొదటి ఫోటో ఐపోయింది. రెండోది విదేశీయుల మధ్య నిల్చుని మా అత్తగారొక్కరూ తీయించుకునేలా ప్లాన్ చేయబడింది. సరీగ్గా క్లిక్ మనిపించే టైమ్‌కి మా అత్తగారు "ఒక్క క్షణం ఆగండి" అన్నారు. నేను ఆవిడక్కూడా చీమ లాంటిదేమైనా కుట్టిందేమో అనుకున్నా.

మా ఎవ్వరి విషయం గుర్తులేనిదానిలా చకచకా రెండు అడుగులు వేసి మాయమయ్యారు. మూడు నిమిషాల తర్వాత ప్రత్యక్షమయ్యారు, మీనాక్షమ్మ గారితో సహా. ఆశ్చర్యంతో తెరుచుకున్న మా నోళ్లు మూతపడేలోగానే విదేశీయులనీ, మధ్య నిలుచున్న మీనాక్షమ్మ గారినీ, మా అత్తగారినీ కలిపిన కెమెరా క్లిక్‌మంది. ❐